క్లుప్తంగా

ఘనంగా రుద్రాభిషేకాలు


రుద్రాభిషెకాలు చేస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : స్థానిక చంపాగల్లి వీధికి చెందిన కంచి కామాక్షిదేవి స్వర్ణకార సంఘం, జిల్లా స్వర్ణకార సంఘం, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలలో భాగంగా నాలుగో రోజు శనివారం రుద్రాభిషేకాలు జరిగాయి. మహిళలు, కమిటీ సభ్యులు స్ఫటిక లింగానికి అభిషేకాలు, అర్చనలు చేశారు.

హిందీ భాషతో ఉపాధి అవకాశాలు పుష్కలం


చార్టులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రణస్థలం: జాతీయ భాష హిందీని 55 శాతం పైగా ప్రజలు మాట్లాడుతున్నారని, భాషపై పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని హిందీ ఉపాధ్యాయురాలు పి.శ్రీదేవి తెలిపారు. మరువాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శివశంకర్ ఆధ్వర్యంలో శనివారం హిందీ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రహీం, టి.సురేష్, కె.ఖగేశ్వరరావు, బి.గౌరీ హరినాథ్, జి.చిన్ని కృష్ణంనాయుడు, వై.ప్రమీల, పి.సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా మహాలింగార్చన


లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు


అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాస శివరాత్రిని పురస్కరించుకుని శివపంచాయతన సహిత మహాలింగార్చన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. అనివెట్టి మండపంలో వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ అభిషేకార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులు, వేద పండితులు పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యానికి హాని


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం : పొగాకు వాడకం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు అన్నారు. లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పొగాకు వల్ల కలిగే అనార్థాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వద్దు.. జీవితం ముద్దు, సిగరెట్ చిన్నది.. నష్టం పెద్దది, స్మోక్ కాదు.. స్మైల్ అవ్వు వంటి నినాదాలు చేశారు. సిగరెట్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, కంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రువ్వ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రణస్థలం: మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. బంటుపల్లిలో స్వస్థ్ నారీ–స్వశక్త్ పరివార్ అభియాన్, స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బంటుపల్లి సర్పంచ్ ఎన్.రజిని, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఛాయరాజ్ వర్ధంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: ప్రజాసాహితీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఛాయరాజ్ 13వ వర్ధంతి సభ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని నిర్వాహకుడు కొప్పల భానుమూర్తి శనివారం తెలిపారు. 'కవిత్వం కవిత్వం కోసం కాదు' అనే అంశంపై ఒంగోలుకు చెందిన ప్రముఖ కవి సయ్యద్ సాబిర్ హుస్సేన్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

- రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- తొమ్మిది రోజుల పాటు పూజలందుకోనున్న అమ్మవార్లు
- ముస్తాబవుతున్న ఆలయాలు
- సిద్ధమవుతున్న మండపాలు

జగన్మాతా.. నమోస్తుతే..!


కనకదుర్గ అమ్మవారు


బాకర్ సాహెబ్‌పేటలోని దుర్గా మహాలక్ష్మీ అమ్మవారు


గుజరాతిపేట రాజరాజేశ్వరీ పీఠంలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సిక్కోలు నగరం ముస్తాబవుతోంది. అమ్మవారి ఆలయాలతో పాటు ప్రధాన కూడళ్లలో దేవీ విగ్రహాలను కొలువుదీర్చేందుకు మండపాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా మోటారు కార్మికులు విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పలువురు భక్తులు భవానీ మాలధారణలు వేసేందుకు సమాయత్తమవుతున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..

శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలో జయదుర్గా టాక్సీ స్టాండ్, డే అండ్ నైట్ కూడలి శ్రీనవదుర్గా టాక్సీస్టాండ్ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏపీహెచ్‌బి కాలనీలోనూ ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. టౌన్ హాలులో రాజస్థానీ మిలన్ ఆధ్వర్యంలో విద్యుత్ అలంకరణలతో భారీ మండపం సిద్ధం చేస్తున్నారు.

ఆలయాలకు దసరా కళ..

- పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో దుర్గాసహిత సంతోషిమాత అమ్మవారి శరన్నవరాత్రులు మహోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.
- పాత బ్రిడ్జి వద్ద కనకదుర్గ ఆలయం దసరా ఉత్సవాలకు సిద్ధమవుతోంది. అర్చకులు గంధం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో భవానీ మాలధారణలు, మండల దీక్షలు, అర్ధమండల దీక్షలు భక్తులు చేపడతారు.
- పట్టణంలోని పెద్దబరాటంవీధిలోని నీలమ్మతల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహిస్తారు. పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పుజలు జరుగుతాయి. కాకివీధిలో ముత్యాలమ్మ తల్లి ఆలయంలో క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. వీధి మొత్తం విద్యుత్ అలంకరణలతో తీర్చిదిద్దారు. నానుబాలవీధిలో విజయదుర్గా ఆలయం వద్ద రోజుకొక అవతారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు చేయనున్నారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయం, గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయం, బాకర్‌సాహెబ్ పేటలోని దుర్గామహాలక్ష్మీదేవి ఆలయం, గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీదేవి ఆలయాలు విద్యుత్ దీపాలు, తోరణాలతో ముస్తాబు చేస్తున్నారు. మంగువారితోటలో లలితాదేవికి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.
- నగరంలోని దేవీ పీఠాలు శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. గుజరాతిపేటలోని రాజరాజేశ్వరి దేవీపీఠం, కత్తెరవీధిలోని రాజరాజేశ్వరీ దేవిపీఠం, గాజుల వీధిలోని అమ్మవారి పీఠంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


పాతబ్రిడ్జి వద్ద కనకదుర్గ ఆలయం


పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయం

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


ఆరంగి రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం : లావేరు మండలం ఆరంగిపేటలో విశాఖ డెయిరీ డైరెక్టర్ ఆరంగి రమణబాబు సతీమణి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే చిన్నయ్యపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు మీసాల అప్పలనాయుడు మామయ్య కలిశెట్టి నరసింహులు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, రాష్ట్ర ఎస్సీ విభాగం జాయింట్ సెక్రటరీ పెయ్యల లక్ష్మణరావు, గ్రామ నాయకులు ఆరంగి అప్పారావు, శ్రీరామ్మూర్తి, పెద్ది చిరంజీవి, ఆరంగి రమణబాబు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఇబ్రహీంబాద్‌లో వైఎస్సార్ సీపీ నేత పూజారి తవిటినాయుడు మృతిచెందడంతో ఆయన భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, సర్పంచ్ సూర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏడీఏ సోమేశ్వరరావు

జి.సిగడాం : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపైనా ఉందని డ్వామా పీడీ సుధాకర్, జిల్లా వయోజన విద్య ఏడీఏ అల్లు సోమేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ అన్నారు. శనివారం స్థానిక బలిజి కల్యాణ మండపంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి సంతకాలతో పాటు చదువు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, ఏపీడీ సి.బి.హరిత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీరాలక్ష్మి, ఎంఈఓ ముళ్ల శ్రీనివాసరావు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

28న ఫిరంగి దళం మాజీ సైనికుల సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ సైన్యంలో 2వ అతిపెద్ద విభాగంగా పేరొందిన ఫిరంగి దళం(రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీ) మాజీ గన్నర్స్ (సైనికుల) సమావేశం ఈ నెల 28న నరసన్నపేట వేదికగా నిర్వహించనున్నట్లు సీనియర్ సభ్యులు కెప్టెన్ ఎన్.సత్యనారాయణ, లెఫ్టినెంట్ డి.సాంబశివరావు, టి.రామారావు, హవల్దార్ టి.కృష్ణారావు, కిల్లి వెంకటరమణ, సుబేదార్ సీహెచ్ వైకుంఠరావు, ఎ.ఆనందరావు శనివారం తెలిపారు. వివరాలకు 98664 40484 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఫలించిన పోరాటం

- ఎట్టకేలకు రొయ్యిల చెరువుల కాలుష్యం నుంచి మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న పెదగనగళ్లవానిపేట గ్రామస్తులు


రొయ్యిల చెరువులకు విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: రొయ్యిల చెరువుల కాలుష్యం నుంచి విముక్తి కలిగించేందుకు పెదగనగళ్లవానిపేట గ్రామస్తులు చేస్తున్న కృషి ఎట్టకేలకు ఫలించింది. శనివారం బీచ్‌ను సందర్శించిన జిల్లా యంత్రాంగానికి గ్రామస్తులంతా గోడు వెళ్లబోసుకోవడంతో రొయ్యిల చెరువులకు అందుతున్న మెయిన్ కరెంట్ ఫీడర్‌ను అధికారులు తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. పెదగనగళ్లవానిపేటలో ఏడు రొయ్యిల చెరువులు ఉన్నాయి. ఇందులో వాడే రసాయనాల వల్ల గ్రామస్తులు దురదలు, వాంతులు, వికారం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. తాగునీరు సైతం కలుషితమైందని గ్రామస్తులు చెబుతున్నారు. రొయ్యిల చెరువుల కాలుష్యం వల్లే ఇదంతా జరుగుతోందని అప్పట్లో వేసిన ఒక కమిటీ కూడా నిర్ధారించింది. ఇదే విషయాన్ని కలెక్టర్ గ్రీవెన్స్‌తో పాటు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ క్రమంలో శనివారం అంతర్జాతీయ తీర ప్రాంత శుభ్రత కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యేలకు గ్రామస్తులంతా మరోసారి సమస్య విన్నవించారు. దీంతో వారు వెంటనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి చెరువులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సచివాలయంలో గ్రామస్తులతో తహసీల్దార్ గణపతిరావు ఆధ్వర్యంలో తీర్మానం రాయించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులను పిలిపించి రొయ్యిల చెరువులకు అందుతున్న విద్యుత్ మెయిన్ ఫీడర్‌ను తొలగించారు.

కలప లారీ పట్టివేత


కలప లారీలు పట్టుకున్న అధికారులు

ఎచ్చెర్ల : కేశవరావుపేట వద్ద అనుమతులు లేకుండా అక్రమంగా కలప తరలిస్తున్న రెండు లారీలు, రెండు వ్యాన్‌లను విజిలెన్స్, అటవీ శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. 39.970 టన్నుల బరువైన రూ.1,16,058 విలువైన అకేషియా కలపను అధికారులు గుర్తించారు. వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై రామారావు, కానిస్టేబుల్ ఈశ్వరరావు, కన్నబాబు, లక్ష్మీనారాయణ, అటవీ శాఖ అధికారి రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలోని విలీన పంచాయతీ కాలనీల్లో మురుగు కాలువలు ఏర్పాటు, లోతట్టు ప్రాంతాల్లో నీరు పారేందుకు నగర కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం విలీన పంచాయతీల్లోని పలు కాలనీల్లో పర్యటించిన అనంతరం వారు మాట్లాడారు. డీసీసీబీ కాలనీ, జగన్నాథ నగర్, రామ్‌నగర్, గోవింద్‌నగర్, ఇందిరానగర్, తిలక్ నగర్, కృష్ణానగర్, న్యూరాంనగర్, తుమ్మా వీధి దమ్మల వీధి, రైతు బజార్ జంక్షన్ తదితర ప్రాంతాలు రోజుల తరబడి నీటిలో మునిగి ఉంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, సభ్యులు ఎం.గోవర్ధనరావు, నాయకులు కె.సూరయ్య, బి.సింహాచలం, ఎల్.మహేష్ పాల్గొన్నారు.

అలరించిన మధుర గీతాలాపన



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో స్వరాత్మిక సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎస్పీ బాలు సుమధుర గీతాలాపన ఆద్యంతం అలరించింది. బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన మధురగీతాలను విద్యాపీఠం నిర్వాహకులు కె.వి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు గాయకులు ఆలపించారు.

ట్రిపుల్ ఐటీ అధికారికి డాక్టరేట్


వాసును అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల : స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఫైనాన్స్ అధికారిగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ చీపురుపల్లి వాసు ప్రతిష్టాత్మక విశ్వేశ్వరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నాగ్‌పూర్) నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఇన్వెస్టిగేషన్ ఆన్ మ్యాచినింగ్ క్యారెక్టరిస్ట్ ఆఫ్ మెగ్నీషియం మెటల్ మాట్రిక్స్ కాంపొసైట్స్ అనే అంశంపై ఈయన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

చిరస్మరణీయుడు గురజాడ


జంధ్యాల శరత్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న పత్తి సుమతి

శ్రీకాకుళం రూరల్: మహాకవి గురజాడ అప్పారావు తన రచనల ద్వారా చిరస్మరణీయుడిగా నిలుస్తున్నారని సీనియర్ పాత్రికేయుడు జంధ్యాల శరత్ బాబు అన్నారు. గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్సు అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన గురజాడ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కన్యాశుల్కం నాటకం, దిద్దుబాటు కథ వంటి రచనలు అద్భుతమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యనారాయణ, కరస్పాండెంట్ అంబటి రాంబాబు, కళాశాల ఐక్యూ సమన్వయకర్త మార్తాండ కృష్ణ, తెలుగు విభాగాధిపతి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: తన రచనలతో దేశంలోనే గొప్పకవిగా మహాకవి గురజాడ అప్పారావు పేరు పొందారని రిటైర్డ్ లెక్చరర్, జీన్ విజన్ లైబ్రరీ వ్యవస్థాపకురాలు పత్తి సుమతి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో గురజాడ జయంతి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, తెలుగు శాఖాధిపతి కె.జ్యోతిలక్ష్మీ, అధ్యాపకురాలు వి.భవాని, విద్యార్థినులు పాల్గొన్నారు.

కోర్టు సమస్యలపై వినతి


జస్టిస్ సుబ్బారెడ్డిని కలిసిన బార్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డిని శ్రీకాకుళంలోని వసతి గృహంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తులతో వర్క్‌షాప్ నిమిత్తం వచ్చిన ఆయనకు కోర్టులో నెలకొన్న పలు సమస్యలను విన్నవించారు. పాత జిల్లా కోర్టు భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, కార్యవర్గ సభ్యులు మోటూరి భవానీప్రసాద్, కొమ్ము రమణమూర్తి, న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, కృష్ణచంద్, ఎన్ని సూర్యారావు, మామిడి క్రాంతి, గొద్దు భాగ్యలక్ష్మి, బరాటం నాగేశ్వరరావు, తంగి వాసుదేవ రావు, రాజేష్, సూర్య పాల్గొన్నారు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా న్యాయస్థానానికి శనివారం విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

తీర పరిశుభ్రత పాటించాలి


కొవ్వాడలో స్వచ్ఛ సాగర్ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు


వర్సిటీలో స్వచ్ఛ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

రణస్థలం: స్వచ్ఛమైన సముద్రాన్ని భావి తరాలకు అందించాలంటే ఇప్పటి నుంచే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు వై.సత్యనారాయణ అన్నారు. కొవ్వాడ, అల్లివలస, జీరుపాలెం, మెంటాడ గ్రామాల్లో సేవా పక్ష ఉత్సవాలు సందర్భంగా ఇన్‌కాయిస్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ సాగర్ – స్వర్ణ ఆంధ్ర బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. సముద్ర తీరంలో వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త కె.కుమార్, మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు ఎం.పాట్టివాడు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో స్వచ్ఛ క్యాంపస్

ఎచ్చెర్ల : డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ వర్సిటీలో శనివారం స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమం నిర్వహించారు. విభాగాల వారీగా కేటాయించిన ప్రదేశాల్లో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది హాజరై పరిసరాలను శుభ్రం చేశారు. వీసీ కె.ఆర్ రజనీ, రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, ఎస్‌వో సామ్రాజ్యలక్ష్మి, నోడల్ అధికారి డి.చక్రపాణి, కో–ఆర్డినేటర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్లతో భూగర్భ జలాల పెంపు


పనులు పరిశీలిస్తున్న పీడీ సుధాకర్

జి.సిగడాం: జిల్లాలో భూగర్భ జలాలను మరింత పెంపొందించడానికి మ్యాజిక్ డ్రైన్ నిర్మాణ పనులు చేపడుతున్నామని, దీనిలో భాగంగా జి.సిగడాం, రణస్థలం, శ్రీకాకుళం, మెళియాపుట్టిలను మోడల్ మండలాలుగా ఎంపిక చేశామని ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుధాకర్ తెలిపారు. శనివారం మెట్టవలసలో రూ.3 లక్షల 50 వేలతో నాలుగు వందల మీటర్లు పొడవైన కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణారావు, సర్పంచ్ కె.ఆరుద్ర, జి.సిగడాం పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, కామొజుల సీతారాం, పంచాయతీ కార్యదర్శులు రమణ, రౌతు చైతన్యకుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాచర్ల గోపాల్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర అన్నారు. సింగుపురం ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం భారతి సహకారంతో శనివారం 'మన ఊరు, మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ప్లాస్టిక్‌కు వాడకానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యానవన అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పంటల సాగులో అధునాతన పద్ధతులపై డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ మైక్రోసాఫ్ట్ సంస్థ ఫార్మర్ మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా ఉద్యాన కార్యాలయంలో శనివారం జిల్లా ఉద్యావన అధికారి రత్నాల వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్కలి ఏడీ సీహెచ్.చంద్రశేఖరరావు, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు జి.శ్రీకాంత్, డి.శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

తోటపాలెంలో అన్నదానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అన్నదానం మహోత్తర కార్యక్రమని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాస్‌రావు అన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్ విలీన పంచాయతీ తోటపాలెంలో వినాయక ఉత్సవాలలో భాగంగా శనివారం భారీ అన్నదానం నిర్వహించారు.